ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 12-6-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రపంచంలో మంచి ఉంటుంది, చెడు ఉంటుంది. ఏది మంచి, ఏది చెడ్డ అనే విచక్షణ నీకు ఉండాలి. అది లేకపోతే భౌతికంగా గాని ఆధ్యాత్మికంగా గాని నీవు బాగుపడటానికి అవకాశము లేదు. మంచిని ఎలా స్వీకరించాలి, చెడును ఎలా విసర్జించాలి అనే discrimination నీకు ఉండాలి. అందువలన విచక్షణను అభివృద్ధి చేసుకో, తెలివిని అభివృద్ధి చేసుకో. ఈ దేహం నిజం అనుకొంటున్నావు. ఈదేహం కొంతకాలం ఉంటుంది. తరువాత పడిపోతుంది. ఇది eternal కాదు. నీ లోపల ఉన్న పరమేశ్వరుడు eternal. వాడు తెలియటంలేదు కాబట్టి వాడులేడు అనినీవు అనుకోవద్దు. ఏది eternal, ఏది eternal కాదు అనేటువంటి విచక్షణ నీవు అభివృద్ధి చేసుకోవాలి.

దేహము ప్రారబ్ధమును అనుభవిస్తూ ఉంటుంది. పూర్వజన్మలను బట్టి ఆ దేహమునకు ఒక ప్రారబ్ధము ఏర్పాటు అవుతుంది. ప్రారబ్ధమును ఇష్టముతో అనుభవించు. ప్రారబ్ధమును అసహ్యించుకోవద్దు. దేహము ఉన్నంతసేపు ప్రారబ్ధము ఉంటుంది. దేహముతోపాటు ఆ ప్రారబ్ధము కూడా నశిస్తుంది. నీకు ఇష్టమైన వస్తువును తిన్నప్పుడు ఎలా enjoy చేస్తున్నావో అలాగే నీ ప్రారబ్ధమును కూడా enjoy చెయ్యి. కొంత మందికి ఎంతసేపు సమాజములో తిరగాలి అనిఉంటుంది గాని ఏకాంతవాసములో ఉండాలి అని ఉండదు. ఇంటి దగ్గర ఖాళీ అయ్యేటప్పటికి ఎలా వెళ్ళి సమాజములో పడిపోదామా అని చూస్తారు. ఇంటి దగ్గర కూర్చుని ధ్యానం చేసుకొందాము, జపం చేసుకొందాము అని ఏమిఉండదు. ఏకాంతవాసమును కూడా నీవు enjoy చెయాలి. ఏకాంతవాసమును అసహ్యించుకోవద్దు. ఏకాంతవాసమును enjoy చేయటం వలన ఆధ్యాత్మిక అభివృద్ధికి పునాదులు పడతాయి. ఎంతవరకూ సమాజములో ఉండాలో అంతవరకూ ఉండు. అతిగా ఉండవద్దు. అతిగా ఉంటే ఆధ్యాత్మికంగా నీవు నష్టపోతావు. ఇప్పుడు నీకు దేహముతో తాదాప్యం ఉంది. దేహముతో ఎలా తాదాప్యం పొందుతున్నావో లోపల ఉన్న ఆత్మతో అలాగ తాదాప్యం పొందు. దేహముతో తాదాప్యం పొందినపుడు మనకు ఉదాత్తమైన భావాలురావు. లోపల ఉన్న ఆత్మతో తాదాప్యం పొందినపుడు నీకు ఉదాత్తమైన భావాలు వస్తాయి.

కర్మఫలత్యాగమును అభివృద్ధి చేసుకో. కర్మఫలత్యాగం ఒకేసారి రాదు. దానిని ప్రాక్టీసు చెయ్యి. నీవు పనిచేస్తావు. దానికి ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని అంతా నీవే enjoy చేయవద్దు. కర్మఫలాన్ని త్యాగం చేయటం నేర్చుకో. దానివలన నీ మనస్సు పవిత్రం అవుతుంది. మనస్సుకు ఎప్పుడైతే పూర్తిగా పవిత్రత వచ్చిందో ఆ మరుక్షణంలో జ్ఞానం వచ్చేస్తుంది. డబ్బు గురించి కాకపోయినా గౌరవం వస్తుంది అని కొంతమంది పని చేస్తారు. అలా గౌరవాన్ని ఆశించి పనిచేసినా అది కర్మఫలత్యాగము కాదు. నీవు ఏదైనా పని చేసేటప్పుడు లోకంలో ఏదోఒక ప్రయోజనం ఆశించి పనిచేస్తే అది కర్మఫలత్యాగము కాదు. కుండలో నీరు పోస్తాము అనుకోండి. దానినిండా చిల్లులు ఉండే ఆ నీరు ఎంతసేపు ఉంటుంది. మనం చేసే సాధన కూడా అలాగే ఉంది. సాధన చేస్తున్నాము గాని రాగద్వేషముల వలన మన సాధన అంతా వృధా అయిపోతోంది. ఏదైనా సంఘటన జరిగినపుడు మీకు సంతోషం వస్తే వెంటనే మీ మనస్సుమీద రాగం అనే ముద్ర పడిపోతుంది. ఏదైనా సంఘటన జరిగినపుడు దుఃఖంవస్తే వెంటనే మీ మనస్సు మీద ద్వేషం

అనే ముద్ర పడిపోతుంది. మనం జాగ్రత్తగా పరిశీలన చేయటంలేదు కాబట్టి ఆముద్రలు ఎలా పడుతున్నాయో మనకు తెలియటంలేదు. ఈ రాగద్వేషములు ఎప్పుడైతే నీకు వస్తున్నాయో నీవు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందే అవకాశం లేదు. ఈ రాగద్వేషములు రాబోయే జన్మకు బీజములు అవుతున్నాయి. రాగద్వేషములే మనకు రాబోయే జన్మకు పునాదులు అవుతాయి అని మీకు తెలియటంలేదు. రాగ ద్వేషములు నీకు ఉన్నాయో లేదో బాహ్యంగా నీకు జరిగే సంఘటనలను పరిశీలిస్తూ ఉంటే నీకు తెలుస్తుంది. ఈ రాగద్వేషములను తగించుకోవాలి.

నీవు ఏదైనా పని చేశావు అనుకో. దాని వలన గౌరవం వచ్చింది అనుకో. దానిని నీవు enjoy చేస్తావు. దేహగతమైన నేనుతో ఏ విషయాలు అయితే enjoy చేస్తున్నావో అవినీవు enjoy చేసేటప్పుడే పునర్జన్మకు బీజములు అక్కడ పడిపోతాయి అన్న సంగతి ఏ రోజుకు తెలుసుకొంటావు అంటున్నారు ఆచార్యులువారు. వారు అలా చెప్పారు, వీరు ఇలా చెప్పారు అని ప్రమాణాలు ఎందుకు. భగవంతుడు చెప్పిన మాటే నీకు ప్రమాణము అంటున్నారు ఆచార్యులవారు. ఆమాట నీకు సరిగా అర్థమయితే అదే నీకు ప్రమాణము. అయితే భగవంతుని మాట నీకు సరిగా అర్థమవ్వకుండా, నీ హృదయాంతరాళములలోనికి దిగకుండా రాగద్వేషములతో కూడిన నీ మనస్సే అడ్డువస్తోంది.

ఈ పని చెయ్యి. ఇది చేస్తే చనిపోయిన తరువాత స్వర్గలోకం వస్తుంది అక్కడ ఈ భోగం వస్తుంది అని కొంతమంది చెపుతూ ఉంటారు. అటువంటి గొడవలలోనికి వెళ్ళవద్దు. ఆ గొడవలలోనికి వెళితే స్వర్గలోకం లోనికి వెళతావు అనుకో. అక్కడ భోగాన్ని అనుభవిస్తావు. అది అయిపోతుంది. మరల పునర్జన్మకు సిద్ధమవుతావు. నీకు జ్ఞానం కావాలంటే ఫలితాన్ని ఆశించకు. నీవు ఆశించకుండా ఫలితం వచ్చినా దానిని enjoy చేయవద్దు. enjoy చేసావో అది మరల నీ హృదయంలో వాసనగా ఉండిపోతుంది. ఈ లోకంలోగాని, పరలోకంలోగాని ఈ భోగములు వస్తాయి అని చెప్పినప్పటికీ నీకు జ్ఞానం కావాలంటే వాటి మీద నీ మనస్సును పెట్టవద్దు.

మనం అందరము ఎంతో కొంత భక్తులమే. కాని గుడిలోనికి వెళ్ళినపుడు మాకు మోక్షం కావాలి అని భగవంతుని అడిగేవారు ఎంతమంది ఉన్నారు. లోకమునకు సంబంధించిన కోరికలను అడిగేవారు ఉన్నారుగాని నాకు జ్ఞానమును ప్రసాదించు అని అడిగేవారు ఎంతమంది ఉన్నారు. జ్ఞానమును సంపాదించాలి. జ్ఞానం లేకపోతే మోక్షం లేదు. మనం ఏదైనా మంచి పనులు చేస్తే మనస్సు బాగుపడుతుంది. ఆ బాగుపడిన మనస్సుకు మాత్రమే జ్ఞానమును సంపాదించాలనే కాంక్ష కలుగుతుంది. బాహ్యంగా నీవు ఏ సుఖాలు అయితే అనుభవిస్తున్నావో అవి పరిణామంలో విషంతో సమానము. నీవు అటు ప్రయాణిస్తే మరల రాబోయే జన్మలలో వాటినుండి విడిపోవటానికి ప్రయత్నం చేయవలసి ఉంటుంది. తెలివైనవాడు ఏమిచేయాలి అంటే నీ హృదయంలో ఉన్న ఆనందమును enjoy చేయటానికి ప్రయత్నం చేయాలి. బయట ఉన్న వస్తువుల మీద నీ సుఖం కోసం ఆధారపడితే నీకు ఆశాభంగం తప్పదు. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం, తెలివి, విచక్షణ ఇవి అన్నీ ఉన్నప్పటికీ ఈ శరీరం పడిపోకముందే మోక్షస్థితిని పొందాలి అనే కాంక్ష నీ హృదయాంతరాళములనుండి రావాలి. మిగిలినవన్నీ స్వప్న సమానమే, మోక్షాన్ని పొందాలి అనే దృఢనిశ్చయం నీకు ఉండాలి.

మోక్షం పొందాలి అనే కాంక్ష ఒక్కటే సరిపోదు. ఉన్నతమైన, దయాపూరితమైన, ఆత్మానుభవం కలిగిన గురువును ఆశ్రయించు. ఆ గురువు ఎలాఉండాలి అంటే దయకలిగి ఉండాలి, వినేవాడిమీద ప్రేమ కలిగి ఉండాలి, శిష్యుడు బాగుపడాలి అనే కాంక్ష గురువుకు ఉండాలి. ఆ గురువు చెప్పే బోధలో హృదయపూర్వకంగా నీవు కలిసిపోవాలి, కరిగిపోవాలి. ఆ బోధలో కలిసిపోవటానికి నీవు చేయగలిగినంత ప్రయత్నం నీవు చేయాలి. నీవు చేసే ప్రయత్నం హృదయపూర్వకంగా ఉండాలి. ఆ వస్తువును పొందాలి, పొందితీరాలి అనే

కాంక్షతో ప్రయత్నిస్తే నీవు ఒడ్డుకు వస్తావు. నీవు తరిస్తావు. సముద్రం ఎంత విశాలమైనదో శిష్యులపట అంత విశాలమైన దయకలిగిన గురువును ఆశ్రయించండి. గురువుకు శాస్త్రం తెలిసిఉండాలి, అవగాహన చేసుకొనే శక్తి ఉండాలి. సందేహాలు అడిగితే ఉద్రేకపడకుండా బుద్ధి సూక్ష్మతతోటి, శాస్త్ర ప్రమాణముతోటి ఆ సందేహాలను తీర్చగలశక్తి ఆ గురువుకు ఉండాలి.

కొంతమందికి మంచితనం ఉంటుంది. వారిమీద వారికి విశ్వాసం ఉండదు. వారు తొందరగా భయానికి, వేదనకు గురి అవుతారు. ముందు నీ మీద నీకు విశ్వాసం ఉండాలి. నీ ప్రయత్నం మీద నమ్మకం ఉండాలి, ప్రేమ ఉండాలి. నీవు బ్రహ్మానుభవం పొందాలంటే నీవు చేసే ప్రయత్నం మీద నీకు విశ్వాసం ఉండాలి, భగవంతుని మీద భక్తి ఉండాలి. నీవు నడిచివెళ్ళే మార్గము సరిఅయినది అయినపుడు విమర్శలకు నీవు భయపడనక్కరలేదు. అసూయవలన ఎక్కువ విమర్శలు వస్తాయి. అందువలన విమర్శలకు మీరు ఏమి భయపడవద్దు. దేవుడులేడు అని చెప్పేవాడు నాస్తికుడు కాదు. మనిషికి వాడిమీద వాడికి విశ్వాసం లేకపోతే వాడు నాస్తికుడు అని స్వామిజీ చెపుతూఉండేవారు. మీరు అందరూ గుడిలోనికి వెళ్ళి దేవుని చూసివస్తున్నారు. మనిషిలో ఉన్న దేవుని చూడటం కూడా నేర్చుకోండి అన్నారు స్వామిజీ.

ఎదుటివారు మనగురించి ఏమనుకొంటున్నారు అని చూడటం మొదలుపెడితే నీ అహంకారము పెరిగిపోతుంది. కొంతమంది ఎంతసేపు ఎదుటివారు మన గురించి ఏమనుకొంటున్నారు గౌరవంగా అనుకొంటున్నారా, మంచిగా అనుకొంటున్నారా అని చూస్తూఉంటారు. ఇలాఉంటే నీకు తెలియకుండా అజ్ఞానము పెరిగిపోతుంది. ఎదుటివారు నీ గురించి ఏమనుకొంటున్నారు అని అనుకొంటే నీవు ఎంతసాధన చేస్తున్నా చిల్లులు ఉన్న కుండలో నీరు పోసినట్లే. అంటే నీ సాధనకు ప్రయోజనం ఉండదు. అహంకారమునకు ఇతరులు ఉన్నారుగాని ఆత్మకు ఇతరులులేరు. ఈ దేహము ఎవరికి ఉపాధి అంటే అహంకారమునకు ఉపాధి. ఈ దేహమును విమర్శిస్తే నీలోపలఉన్న ఈశ్వరుడు బాధపడడు. ఎందుకంటే లోపలఉన్న ఈశ్వరుడికి ఈదేహం ఉపాధికాదు. నీ లోపల ఉన్న అహంకారము బాధపడుతుంది ఎందుచేతనంటే ఈ దేహము అహంకారమునకు ఉపాధి.

నీ ఆధ్యాత్మికశక్తిని ఉపయోగించుకొని నిన్ను నీవు రక్షించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీవు జనన మరణ ప్రవాహములో కొట్టుకొనిపోతున్నావు. ఈ ప్రవాహములో నుండి ఒడ్డుకు రావాలంటే నీ భక్తే నిన్ను రక్షిస్తుంది. మోక్షం పొందాలనే కాంక్ష దానిగురించి నీవు చేసే ప్రయత్నమే నిన్ను రక్షిస్తుంది. దానివలననే నీవు ఒడ్డుకు రాగలవు. అంతకంటే ఇంకో ఉపాయం లేనేలేదు. నీవు ఏ పని చేసినా ఆ పని నిన్ను బంధించకూడదు అటువంటి పని చేస్తూఉండు. మరల నిన్ను ఈ ప్రపంచములోనికి తీసుకొనివచ్చే పనులు నీవు చేయవద్దు. ప్రాపంచిక జ్వరం తగ్గించుకో. ఎటువంటి పనులు చేస్తే మరల ఈ ప్రపంచంలోనికి రావో అటువంటి పనులు చేస్తూ ఉండు. కర్మఫలత్యాగి సన్యాసి అని కృష్ణుడు చెప్పాడు. కాషాయగుడ్డలు కట్టుకొన్నవాడు సన్యాసికాదు. కర్మచేసి ఆ కర్మఫలమును త్యాగం చేసేవాడు సన్యాసి. నీవు చేసే ప్రతీ మంచి పని వలన, నీకు వచ్చే ప్రతీ మంచి ఆలోచనవలన నీ మనస్సు పవిత్రం అవుతూ ఉంటుంది. మీకు ఏదైనా మంచి తలంపు వచ్చింది అనుకోండి. మీ శరీరము పడిపోయినా ఫరవాలేదు. మన తలంపు గురించి పనిచేసేవారు వెనకాలవస్తారు. మీ శరీరం ఉందా, లేదా అన్నది ముఖ్యంకాదు. ఈ శరీరం పడిపోయినా ఫరవాలేదు. మనకు మంచి ఆలోచనలు వస్తూ ఉంటే, మనకు ఉన్న ఆదర్శములు మంచివి అయితే మన శరీరం చనిపోయినా వాటిని అమలు జరిపే శరీరాలు భవిష్యత్‌లో అనేకం వస్తాయి. ఈ శరీరమే చేయాలి అని అనుకోనక్కరలేదు.

**Subject** తప్ప వేరే గొడవలు ఏమైనా శంకరాచార్యులవారితో చెపితే **I have no time to waste** అనేవారట. జ్ఞానమునకు సంబంధించినవి కాకుండా మిగతా గొడవలు ఎవరైనా ప్రస్తావిస్తే మీ గొడవలతో

కాలక్షేపం చేయటానికి ఇప్పుడు నాకు టైము లేదు అనేవారట. మాట్లాడితే Subject గురించి మాట్లాడటం లేకపోతే అక్కడనుండి లేచి వెళ్లిపోవటం అంతే.

కొంతమంది జీవితమును enjoy చేయరు. ఏదో బరువు మోస్తున్నట్లుగా ఉంటారు. నీ మనస్సు పవిత్రం అవుతూఉంటే నీ జీవితం అంతా తేలిక అవుతుంది. జీవితం నీకు బరువు అనిపించదు. నీవు చేసే మంచి పనులను బట్టి, నీవు మాట్లాడే మంచి మాటలను బట్టి నీ జీవితం తేలిక అవుతుంది. జీవితాన్ని మోయనక్కరలేదు. జీవితాన్ని enjoy చేయవచ్చు. నేను మంచిపనులు చేస్తున్నాను, మంచి మాట్లాడుతున్నాను అన్నంత మాత్రం చేత జ్ఞానం వస్తుంది అని ఆశపడకు. బాహ్యంగా నీవు చేసే మంచిపనుల వలన మోక్షంరాదు. జ్ఞానం వలననే మోక్షం రావాలి. నీకు బుద్ధిసూక్ష్మతలేదు అనుకో, జ్ఞానం కలుగలేదు అనుకో నీవు బాహ్యంగా వేలాది కర్మలు చేసినా నీకు మోక్షం రాదు. జ్ఞానం వలననే మోక్షం వస్తుంది.

మీరు దేవుని ఎలా ధ్యానం చేస్తున్నారో అలాగ దేవుని మాటను కూడా ధ్యానం చేయటం నేర్చుకోండి. ఆ మాటలను విడిచిపెట్టవద్దు. ఆ మాటలను మననం చేయండి. ఆ మాటలను ధ్యానం చేయండి. అప్పుడు మీ మనస్సుకు శాంతి కలగటానికి అవకాశం ఉంది. భగవంతుని మాటలను అర్థం చేసుకొని, అర్థం చేసుకొన్న విషయాలను ధ్యానం చేస్తే మీకు అనుభవంలోనికి వస్తుంది. మీ అనుభవం హృదయంలో ఉన్న సత్యాన్ని మీకు పట్టి ఇస్తుంది. subject అర్థం కాకపోతే, నీవు ఏ వస్తువును పొందటానికి ప్రయత్నం చేస్తున్నావో దానికి సంబంధించిన అవగాహన నీకు లేకపోతే బాహ్య ప్రక్రియలవలన నీకు మోక్షం రాదు. subjectను సరిగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. బాహ్యంగా మీరు కొన్ని పరిస్థితులను అనుకూలం చేసుకొన్నంత మాత్రం చేత మీకు జ్ఞానం రాదు. ఇలా చేసుకోవటం మంచిదే. కాని వాటివలననే మోక్షం రాదు. మోక్షమును పొందాలి అనే కాంక్ష నీ హృదయాంతరాళములనుండి రావాలి అది ముఖ్యం.

మనిషి చనిపోవటానికి ఒకరోగం చాలు. అలాగే మనిషి పాడైపోవటానికి ఒక ఇంద్రియం కంట్రోలులో లేకపోయినా చాలు. టీవి చూడటం నీ కంటికి ఆనందం. టీవి వలన నీకు వచ్చే ఆనందం అంతాకూడా విషం క్రింద మారిపోతుంది. అన్ని ఇంద్రియాలను మనం జాగ్రత్తగా స్వాధీనం చేసుకోవాలి. వాటిని స్వాధీనం చేసుకొంటే అవి మనకు స్నేహితులులాగ ఉపయోగపడతాయి. మీ ఇంద్రియాలు అన్నీ మీ స్వాధీనంలో ఉంటే ప్రపంచంలో అంతా మీకు శత్రువులుగా ఉన్నా మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. మీ ఇంద్రియాలు మీకు స్వాధీనంలో లేకపోతే ప్రపంచం అంతా మీకు అనుకూలంగా ఉన్నా మీరు పతనమవుతారు. బయట శత్రువులవలన మనకు ప్రమాదం లేదు. లోపల శత్రువుల వలననే మనకు ఎక్కువ ప్రమాదం.

మీకు తాత్కాలికంగా సుఖాన్ని ఇచ్చే విషయాలు ఉంటే వాటిని ఒకటి తరువాత ఒకటి విడిచిపెట్టండి. అందరికీ దేహం అంటే చాలా ఇష్టం. డబ్బుకంటే కూడా మీదేహం అంటే మీకు ఇష్టం. దేహం లేని పరిస్థితిలో కూడా మనం ఉంటాము అన్నసంగతి వాడికి తెలియక higher birth రావాలి అని కోరుకొంటాడు. అంటే మొత్తంమీద దేహాన్ని కోరుకొంటున్నాడు. ఇలా మీరు దేహాన్ని కోరుకొంటూ ఉంటే మీకు మోక్షం మటుకురాదు. మోక్షం యొక్క విలువ తెలియక మోక్షాన్ని కోరుకోవటం లేదు. మోక్షం గురించి శ్రవణం చేయక మంచి జన్మరావాలి అనికోరుకొంటున్నాడు. దేహం వస్తుంది. ఎంతకాలం ఉంటుంది. కొంతకాలం ఉండి నశిస్తుంది. మనకు ఉన్న దేహబుద్ధి మూలంగా లోపలఉన్న సద్వస్తువును మనం కోరుకోవటం లేదు. మంచి జన్మ రావాలి అని కోరుకొంటున్నాము. మంచి జన్మరావాలి అని కోరుకోవటం కూడా మీకు మోక్షానికి అడ్డువస్తుంది. నీకు తెలియకుండా నీలో భోగకాంక్ష ఉంది. నీకు భోగకాంక్ష ఉందికాబట్టి దేహాన్ని కోరుకొంటున్నావు గాని నీకు భోగకాంక్ష లేకపోతే దేహంతో పని ఏముంది అంటున్నారు ఆచార్యులవారు.

మీకు మోక్షం పొందాలి అనే కోరిక ఉంటే దేహప్రారబ్దములో ఏది వస్తే దానిని react అవ్వకుండా అనుభవించండి. కొంతమంది వారు ఇలా అన్నారు, వీరు అలా అన్నారు అని ఎప్పుడూ నేరములు చెపుతూ ఉంటారు. కొంతమంది నేరములు చెప్పకపోయినా లోపల కూర్చొని ఏడుస్తూ ఉంటారు. ఇవి రెండూ వదులుకోండి. నోరు ఉన్నవారు complaint చేస్తారు, ఊరుమీద పడతారు. లేనివారు ఇంటిదగ్గర కూర్చొని ఏడుస్తారు. మీరు ఊరు మీద పడవద్దు, ఇంటి దగ్గర ఏడవవద్దు అంటున్నారు ఆచార్యులవారు. complaint వద్దు, lament వద్దు. మీ ప్రారబ్దమును enjoy చెయ్యండి. ఈ భూమి మీదకు ఒంటరిగా వచ్చాము, ఒంటరిగా వెళ్ళిపోతాము. కూడా ఎవరూ రారు. అందువలన కొంత ఏకాంతవాసమును ప్రాక్టీసు చెయ్యి. నీ దేహయాత్రకు సమాజము ఎంతవరకూ అవసరమో అంతవరకూ సమాజమును ఉపయోగించుకో. అతిగా ఉంటే నీ సాధన దెబ్బ తింటుంది. సంస్థల ద్వారా, సమాజము ద్వారా ఇంతవరకూ ఈ సృష్టిలో ఎవడికీ మోక్షం రాలేదు. నీఅంతట నీవు సాధనచేసి దానిని పొందవలసిందే. నీవు ఊరుమీద పడకుండా, ఇంటిదగర ఏడవకుండా నీ మనస్సును శాంతిగా ఉంచితే నీ ప్రారబ్దమును ప్రశాంతముగా అనుభవించగలిగితే అది క్షమ. నీకు బ్రహ్మానుభవం కలగటానికి ఆ క్షమ సహకరిస్తుంది.

నీకు స్థిరమైన సంకల్పము, ధృడమైన సంకల్పము ఉండాలి. అది సంపాదించటమో లేక ఆ ప్రయత్నంలో మరణించటమో అన్నట్లు నీ సంకల్పము ధృడంగా ఉండాలి. సంపాదిస్తే సంపాదిస్తాము లేక ఆ ప్రయత్నములో మరణిస్తే తరువాత జన్మలో దానిని పొందటానికి భగవంతుడు నీకు తగిన అవకాశములను ఇస్తాడు. నీవు పొందవలసిన దానికోసం స్థిరమైన సంకల్పముతో ప్రయత్నం చెయ్యి. నీ సంకల్పము బండగా ఉండకూడదు. నీ స్థిరమైన సంకల్పానికి అవగాహనాబలం కూడా ఉండాలి. నీకు స్వంత ఆలోచన ఉండాలి. బండతనంతో స్థిరమైన సంకల్పము ఏర్పరచుకొన్నా అది కాలప్రవాహములో కొట్టుకొని పోతుంది. subjectకు సంబంధించిన అవగాహన నీకు ఉంటే స్థిరమైన సంకల్పము వస్తుంది. గురువు చెప్పినమాటల మీద నీకు విశ్వాసం ఉండాలి. అవి సరిగా నీకు అర్థమవ్వాలి. గురువు చెప్పినమాటల యొక్క అనుభవం నీకు రావాలి. అనుభవం నీకు లేకపోతే స్థిరమైన సంకల్పము మీరు చేసుకొన్న అది నిలబడదు. గురువు చెప్పిన మాటల మీద సరియైన అవగాహన రావాలి. ఎప్పుడైతే నీకు అవగాహనపూర్వకమైన విశ్వాసం ఏర్పడిందో అటువంటి విశ్వాసం మటుకు నీ హృదయంలో ఉన్న సత్యమును నీకు పట్టి ఇస్తుంది. నీ హృదయంలో దేవుడు ఉన్నాడు. ఆ దేవుడు నీ స్వంతం అని నీవు అనుకోవటం లేదు. ఈ దేహం నీ స్వంతం అని అనుకొంటున్నావు. నీకు అవగాహనపూర్వకమైన విశ్వాసం ఎప్పుడైతే ఏర్పడిందో అప్పుడు స్థిరమైన సంకల్పము నీకు కలుగుతుంది. దేవుడికి నీకు బేధం లేని స్థితిని స్థిరమైన సంకల్పము నీకు ప్రసాదిస్తుంది అంటున్నారు ఆచార్యులవారు.

ఎవడికైతే అజ్ఞానము నుండి బయటకు రావాలి అని లేదో వాడికి మోక్షం వచ్చే సమస్యేలేదు అంటున్నారు ఆచార్యులవారు. మీ అజ్ఞానం అంటే మీకు తియ్యగా ఉంది. అందువలన దానిలో నుండి మీరు బయటకురాలేరు. మీ అజ్ఞానంలో ఉన్న చెడు, పరిణామంలో అది తీసుకొనేవచ్చే కష్టాలు గురించి ఆలోచించుకొని అందులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయకపోతే మోక్షం రాదు. అజ్ఞానములో ఉన్న చెడ్డ మీకు అవగాహన అయితే మీరు అజ్ఞానమును విడిచిపెట్టగలరు గాని లేకపోతే అజ్ఞానమును విడిచిపెట్టలేరు. అజ్ఞానములో నుండి బయటకు రాకపోతే కోట్లాది జన్మలు ఎత్తినా మీకు మోక్షంరాదు.

పుట్టుక చావును తీసుకొని వస్తుంది. చావు మరల తిరిగి పునర్జన్మను తీసుకొని వస్తుంది. దేహం మరణిస్తుంది అంటే మనకు దుఃఖము వస్తుంది. మనకు దేహవాసన ఉంది కాబట్టి దేహము నుండి విడిపోయేటప్పుడు మనకు దుఃఖము వస్తుంది. దేహవాసన లేకపోతే దేహం నుండి విడిపోయేటప్పుడు దుఃఖం రాదు. దేహవాసన అనే సంకెళ్ళ నుండి బయటకు రావటం మీకు ఇష్టం లేదు. ఈ సంకెళ్ళను నేను తెంపుకోలేను. ఈ సంకెళ్ళ నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తున్నాను. ఇందులో నుండి బయటకు రాలేకపోతున్నాను. నేను

నీకు కావాలంటే ఈ సంకెళ్ళను నీవే తెంపి నన్ను నీలోనికి తీసుకో అని భగవాన్‌తో చలంగారు అన్నారు.

(నీవు దేహవాసనను విడిచిపెట్టలేకపోతున్నావు. అజ్ఞానమును విడిచిపెట్టలేక పోతున్నావు. వీటిని విడిచి పెట్టటానికి ప్రయత్నం చేయలేకపోతే నీవు subjectను శ్రద్ధగా విను. నీవు అలా ప్రయాణం చేయలేకపోయినా ఇలా ప్రయాణం చెయ్యి అంటున్నారు ఆచార్యులవారు. నీవు subjectను శ్రద్ధగా విను. దానిని ధ్యానం చెయ్యి. subject వినగావినగా దానిని ధ్యానం చేయగాచేయగా ఆ ప్రయాణంలో ఈ దేహవాసన, అజ్ఞానము దానంతట అవేరాలిపోతాయి.) మోక్షం పొందాలి అనే కాంక్ష, ఆకోరిక కొంచమైనా నీకు ఉందా అని గురువు పరిశీలనగా చూస్తాడు. నీలో ఆకాంక్ష కొద్దిగా అయినా ఉంటే గురువు తన అనుగ్రహాన్ని ప్రవాహములాగ పంపిస్తాడు. మోక్షమును పొందాలి అనే కాంక్ష కొద్దిగా ఉన్నా గురువు తన అనుగ్రహంతో దానిని పెద్దది చేస్తాడు. మీరు దేహగతంగా జీవిస్తూ ఉంటే దేహగతమైన మాటలు చెప్పి వదిలివేస్తాడు. మోక్షకాంక్ష మీలో ఉంటే మిగిలిన పనులు అన్నీ గురువే చేస్తాడు. దేహబుద్ధిని త్యాగం చేసే శక్తిని కూడా నీకు ఇస్తాడు. ఆశక్తి సహాయంతోనే నీవు దేహబుద్ధిని cut చేసుకోగలవు. మోక్షకాంక్ష నీలో కొద్దిగా ఉన్నా ఆ మొక్కను వృక్షం అయ్యేవరకు జాగ్రత్తగా పెంచుతాడు. మొక్క పెద్దది అయ్యింది అని దానిని విడిచిపెట్టడు. దానికి జ్ఞానం అనే పండు కాసే వరకు విడిచిపెట్టడు. వాడు గురువు. మోక్షం పొందాలనే కాంక్ష నీకు ఉంటే మంచి గుణాలు వచ్చి నిన్ను వరిస్తాయి. వాటి అంతట అవే వచ్చి నిన్ను వరిస్తాయి. ప్రత్యేకంగా నీవు సంపాదించనక్కరలేదు. భక్తుడిని తెలివితక్కువవాడు అని సమాజం అనుకోవచ్చును కాని దేవుడు అలా అనుకోడు.

నీవు ఏపని చేసినా ఈశ్వరార్పణంగా చేయటం నేర్చుకో. భక్తి దేనికీ పనికిరాదు అని అనుకోవద్దు. మోక్షమును సంపాదించటానికి ఉపయోగించే సామాగ్రిలో ముఖ్యమైనది భక్తి. దేవుడు బొమ్మల దగ్గర పువ్వులు పెట్టటం మాత్రమే భక్తి అని అనుకోవద్దు. గుడిచుట్టూ తిరగటమే భక్తి అని అనుకోవద్దు. ఇవి అన్నీ చేసుకోండి. నీ స్వరూపమును తెలుసుకోవటానికి నీవు చేసే ప్రయత్నమే భక్తి. నీలోపల ఉన్న ఆత్మను తెలుసుకోవటానికి నీవు హృదయపూర్వకంగా చేసే ప్రయత్నమే భక్తి. (ప్రతీదానికి love ను link పెట్టుకో అంటున్నారు ఆచార్యులవారు. నీవు ఏదైనా మాటను మాట్లాడితే అందులో ప్రేమ ఉండాలి. నీవు చేసే పనిలో ప్రేమ ఉండాలి. అలా ఉన్నా బ్రహ్మానుభవం కలగటానికి నీకు అర్హత కలుగుతుంది. గౌరవం కోసం మీరు ఎదుటి మనిషిని ప్రేమిస్తున్నారు అనుకోండి అది నిజమైన ప్రేమకాదు. అది వ్యాపారమే. నిజమైన ప్రేమకూడా భక్తిలో ఒక భాగమే. భగవంతునియందు మనకు ఉన్న ప్రేమనే భక్తి అంటారు. ప్రతీ విషయంలోనూ ప్రేమను ప్రాక్టీసు చెయ్యండి. నీకు అవగాహనశక్తి ఉండాలి లేకపోతే నీ love చెదిరిపోతుంది.)

ఎదుటివారు మనలను ప్రేమిస్తూ ఉంటే తిరిగి వారిని మనం ప్రేమిస్తున్నాము. అది లౌకికులే చేస్తున్నారు. మీరు భక్తులై ఉండి మిమ్మల్ని ప్రేమించనివారిని ప్రేమించలేకపోతే మీరు భక్తులు ఎలా అవుతారు. ఎదుటివారు నిన్ను ప్రేమించకపోయినా వారిని కూడా నీవు ప్రేమించటానికి నీకు భక్తి అవసరము.

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము 5-7-96)**